హిందీమూలం : ప్రీతమ్ బేలీ                అనువాదం : గాదంశెట్టి

# ఒక చొక్కా, ఒక అబద్ధం

బేచర్‌కు ఇంతకు ముందెప్పుడూ ఇలా జరగలేదు. అతడు చొక్కా ఎప్పుడూ తొడుక్కోలేదు. ఇంతవరకూ పనికి పోలేదు. రాత్రిళ్లు ఇలా ఎప్పుడూ జాగారం కూడా చేయలేదు.

రాత్రంతా బేచర్ అటూ ఇటూ పొర్లుతూనే వున్నాడు. ఒక్కక్షణంకూడా కునుకు తీయలేదు. తన కొత్త చొక్కా గుడిసెలోనే తన ఎదుటనే ఒక చిలుము పట్టిన పాత టిన్నురేకు డబ్బాపైన పెట్టివుంది.

బేచర్ ఇంతకు ముందెప్పుడూ చొక్కా తొడుక్కోలేదు.

గ్రీష్మఋతువు మండిపోయే కంబళి మాదిరి వస్తుంది. ఆ పెళపెళలాడే ఎండల్లో చొక్కా అవసరమే వుండేదికాదు.

వర్షఋతువులో బాగా వానకురుస్తుంది. వానజల్లు కొరడా దెబ్బల్లాగా వొంటిపైన పడుతుంది. చురుకైన సూదుల్లాంటి వర్షపుబొట్లు వేనకువేలు వొంటిపైన పడుతూవుంటాయి. వాటి చురుకైన కొనల తాకిడికి తట్టుకుంటూ నల్లని తాబేలులాగా ముడుసుకపోయి మోకాళ్లసందున తలదాచుకొని గుడిసెలోనే గుట్టుగా వుండిపోయేవాడు. వర్షాలు దాటిపోగానే ఊరిబయట, ఆ భిల్లుల గూడెంలో, చుట్టుపట్ల కొండలపైన, వాటి లోయల్లోన పరిసర పొలాల్లోన నలువేపుల పచ్చపచ్చని మెత్తని గడ్డి దుప్పట్లు పరచినట్లుండేది. అప్పుడుకూడా బేచర్‌కు చొక్కా అవసరం వుండేదికాదు.

శీతాకాలపుచలి చురుకైన కత్తిపదునులాగా శరీరంలో గుచ్చుకుంటుంటే, బేచర్ ఒక పాత గోనెపట్ట ముక్క వొంటికి చుట్టుకొని తిరుగుతూ వుండేవాడు.

కలపమండీ యజమాని ముసలి షావుకారు కరెంట్‌షాక్ తగిలి ఆకస్మికంగా చనిపోతే, ఆయన కొడుకు తన తండ్రి తాలూకు మంచి మంచి ఖరీదైన బట్టలు బ్రాహ్మలకు దానంచేసి, పాత బట్టలు బీదలకు దానంచేస్తే ఓ పాత కంబళీ బేచర్ తండ్రి మంగలూ వంతుకు వచ్చింది.

మంగలూ ఆ పాత కంబళీని రెండు ముక్కలుచేసి ఒకటి తన పెళ్లానికీ, రెండోది బేచర్‌కూ ఇచ్చాడు.

బేచర్ తన వొంటిపైనున్న పాత గోనెపట్ట తీసివేసి దాన్ని చిన్న చిన్న ముక్కలుచేసి, వాటిల్లో ఎండుగడ్డి కుక్కి చిన్న చిన్న బంతులు చేశాడు. వొంటిమీద ఆ పాత కంబళిముక్క చుట్టుకొని ఊళ్లో తిరుగుతూ ఇంటింటికీవెళ్లి ఆ బంతులు తన సావాసగాళ్లకు పంచాడు.

బంతులు పంచడం నెపంమాత్రమే. తన కంబళి సావాసగాళ్లకు చూపడమే అతడిలోని ఆకాంక్ష. ఆరోజు సాయంకాలం వరకు పిల్లలంతా బేచర్ తయారుచేసిన బంతులతో ఆడుకుంటూ వుండిపోయారు. వాళ్లంతా కావాలనే, ఏదో ఒక నెపంతో బేచర్ చుట్టుకొన్న కంబళిని ముట్టుకునేవాళ్లు. కంబళిని తాకినంతనే తమశరీరాల్లో వేడి పాకినట్లుగా వాళ్లంతా భావించేవాళ్లు.

కంబళిముక్క గుడిసెలో తనక్రింద పరుచుకొన్నాడు. కొత్త చొక్కా ఎదురుగుండా చిలుము డబ్బాపైన పెట్టివుంది.

బేచర్ నెమ్మదిగాలేచి తన చొక్కాపైన చెయ్యివేసి నిమరడం మొదలెట్టాడు. బేచర్ తల్లీ దండ్రీ ఇద్దరూ గురకలు పెడుతున్నారు. తండ్రిగురకలు బిగ్గరగా, తల్లిగురకలు మెల్లగా వున్నాయి. వాళ్ల హెచ్చు తగ్గు గురకలు వింటూంటే, బేచర్‌కు సంబరంగా వుంది. తాను కూడా కృత్రిమంగా గురకలు తీయడం మొదలెట్టాడు. వాళ్ల ముగ్గురి గురకలు ఒకదానిలో ఒకటి లీనమైపోతున్నాయి.

కృత్రిమంగా గురకలు తీయడంలో బేచర్ గొంతు ఎండిపోయింది. నీళ్లుత్రాగడానికి గుడిసెలోనుండి బయటికివచ్చాడు. ఊరికుక్క బొంకా ఓ మారు బిగ్గరగా మొరిగి బేచర్ అడుగుల శబ్దం గమనించి అతనివద్దకు వచ్చేసింది. బేచర్ రావిచెట్టుక్రిందవున్న కడవలో నీళ్లుముంచుకొని త్రాగాడు. గుటకలు వేసేప్పుడు నీళ్లలో ఒక నక్షత్రం మెరుస్తూ, కదులుతూ కనపడింది. తలఎత్తి నీలాకాశంవంక చాలాసేపు చూస్తూ వుండిపోయాడు. రాత్రి కప్పుకున్న నల్లకంబళికి వందలకొలది వెండి, బంగారు నక్షత్రాలు పొదగబడి వున్నాయి. చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు. నక్షత్రాలు కూర్చబడ్డ ఆ ఆకాశపు చొక్కా ఎంతబాగుంది! దూరంగా పొలాల్లో మిణుగుర్లు మిలమిల్లాడుతున్నాయి. అవన్నీ చూస్తూ వుండిపోయాడు. అతడికేమీ అర్థంకావడంలేదు. ఈ నక్షత్రాలు, ఈ మిణుగుర్లు, ఈ రాత్రి, నక్షత్రాలు చెక్కబడ్డ ఈ ఆకాశపుచొక్కా, గుడిసెలోపల చిలుము డబ్బాపైన పెట్టివున్న తనచొక్కా, ఇదంతా అయోమయంగా వుంది.

కుక్క బేచర్ కాళ్లు వాసన చూచి అతడిదృష్టి తనవేపుకు తిప్పుకుంది. బేచర్‌వంగి దాని ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు. కుక్క కళ్లు మూసుకుంది.

"బాంకా, నా కొత్తచొక్కా చూస్తావా?" బేచర్ అడిగాడు కుక్కను.

కుక్క తోకఆడిస్తూ వుండిపోయింది.

బేచర్ పరుగెత్తుకుంటూవెళ్ళి గుడిసెలో దూరి తన కొత్త చొక్కాతెచ్చి కుక్కకు చూపిస్తూ తాను చూస్తూ వుండిపోయాడు. కుక్క తోక పైకెత్తి అతడిముందు గంతులు వేయసాగింది. ఉల్లాసంతో ఊగిపోతున్న బేచర్ కుక్కతోక పట్టుకొని పైకిలాగాడు. కుక్క కుంయ్ కుంయ్‌మంటూ పరుగెత్తిపోయింది. అతడేమో సంబరపడుతూ గుడిసె లోపలికి వెళ్ళిపోయాడు. చొక్కాను మళ్ళీ అదే పాత డబ్బామీద పెట్టేశాడు. క్రిందపడుకొని అటూ ఇటూ పొర్లుతూ తల్లిదండ్రుల గురకలువింటూ సూర్యోదయంకోసం ఎదురుచూస్తున్నాడు.

ఆనాటి సాయంకాలం మంగలూ ఇంటికివచ్చి బేచర్‌కు పని దొరికిందన్న సంతోషవార్త చెప్పాడు. ఊరి ప్రక్కనున్న పొలంలో ప్రభుత్వం నూనెగనుల కొరకు అన్వేషణ జరుపుతూంది. బావులు త్రవ్వబడుతున్నాయి. కాంట్రాక్టర్లు పని ప్రారంభం చేశారు. ఒక సూపర్‌వైజర్ను బ్రతిమాలుకొని మంగలూ తన కొడుక్కు పని ఏర్పాటు చేసుకొనివచ్చాడు.

ఈ వార్తవిన్న బేచర్ తల్లి పట్టరానంత సంబరపడింది. తన కొడుకు మొట్టమొదటగా పనిలో ప్రవేశిస్తున్నందుకు ఒక కొత్త చొక్కా తెమ్మని భర్తతో చెప్పింది. భర్త రాత్రికి బజారు నుండి వచ్చేప్పుడు రెండురూపాయల చొక్కా ఒకటి తెచ్చాడు. బేచర్ ఇంతకు ముందెన్నడూ చొక్కా తొడుక్కోలేదు, పనికి వెళ్ళనూలేదు. రాత్రంతా ఇలా జాగారం కూడా ఎప్పుడూ చేయనే లేదు.

అటు ఇటూ పొర్లుతూనే రాత్రంతా గడిపాడు. రాత్రి, మిణుగుర్ల మెరుపులు, నక్షత్రాలు చెక్కబడ్డ ఆకాశపు చొక్కా, అన్నీ మాయమైపోయాయి. పగలు వచ్చేసింది తన రంగురంగుల ముస్తాబుతో.

తొడుక్కొన్న చొక్కా ఎలా వుంటుందో ఓమారు చూసుకోవాలనుకున్నాడు బేచర్. చొక్కా తొడుక్కొని ఒక పగిలిపోయిన అద్దంముక్కలో చాలాసేపటివరకు కళ్లు నిక్కబొడుచుకొని చూస్తూ వుండిపోయాడు. కాని విరిగిపోయిన ఆ అద్దంముక్కలో ఓమాటు ఒక చెయ్యి సగం కనబడితే మరోసారి మెడమాత్రమే కనబడేది. పై భాగం ఓమారు కనబడితే క్రిందిభాగం మరోమారు. వెనుకభాగం బొత్తిగా కనబడ్డమేలేదు. పాపం! బేచర్ మొత్తం చొక్కా ఒకేసారి చూడాలనుకున్నాడు. కాని వీలుకావడంలేదు.

ఉదయాన్నే కుక్కను వెంటబెట్టుకొని దగ్గరి పొలాల్లోకి వెళ్ళాడు.

ఒక పంటపొలంలో దిష్టిబొమ్మను చూశాడు. దాని పాత చొక్కా తీసేసి తన కొత్తచొక్కా తొడిగాడు. దిష్టిబొమ్మను ఈ కొత్త చొక్కాలో చూసిన కుక్క భౌం భౌం అంటూ తోక ముడుచుకొని పరుగెత్తింది. బేచర్‌కు చాలా ఆనందం కలిగింది. అతడు ఆ దిష్టిబొమ్మను నాలుగువేపుల తిరిగి తిరిగి మనసారా చూస్తూ వుండిపోయాడు.

తర్వాత తన చొక్కా విప్పదీసుకొని స్నానం చేయడానికి నది ఒడ్డుకు వెళ్ళాడు.

ఒక చిన్న రాతిని ఒక పాతమేకుతో గీరి గీరి దాని చిట్టు తయారుచేశాడు. నదిలోకివెళ్ళి ఆ చిట్టుతో రుద్దిరుద్ది ఒళ్లంతా శుభ్రం చేశాడు. అతడి కాకిరంగు మెరవడం మొదలెట్టింది. తన మొదటిచొక్కా మొదటగా తొడుక్కోవడంలో తిరగబడిపోయింది. మళ్ళీ విప్పి సరీగ్గా తొడిగాడు. మళ్ళీ తొడుక్కున్నప్పుడు మళ్ళీ మళ్ళీ విప్పడం తొడగడం చేయవలసి వచ్చింది.

ఇంటికి తిరిగివస్తున్న బేచర్ తనలో తాను మురిసిపోతున్నాడు. తన సంతోషానికి తానే సిగ్గుపడుతున్నాడు.

తల్లి కొత్తచొక్కా తొడుక్కొన్న తన కొడుకును చూసి నుదుట ముద్దుపెట్టుకొంది. తండ్రి తలమీద చేయిపెట్టి నిమిరాడు. ఆ రోజు బేచర్‌కు లభించపోయే కూలీ 'రూపాయ'లో అతడి జేబు ఖర్చుకుగాను రెండుపైసలు ఇవ్వాలా లేక ఐదుపైసలా? అన్న విషయాన్నిగురించి తల్లి దండ్రులిద్దరూ చాలాసేపటివరకు ఒక నిర్ణయానికి రాలేకపోయారు.

తల్లి కుమారుని ముఖంవేపు స్పష్టంగా చూసింది. చిన్నప్పుడు తన భర్త ముక్కూ మొఖంకూడా ఇలాగే వుండేదనిపించింది. వెంటనే భర్తకు నచ్చజెప్పింది, బేచర్‌కు జేబుఖర్చుకుగాను ఐదు పైసలు ఇవ్వాల్సిందేనని.

తండ్రి కలప మండీవేపు తన పనిమీద వెళ్ళాడు. బేచర్ తన తండ్రి చెప్పినట్లుగా ఊరిబయట నూనెబావులు త్రవ్వేవేపుకు నడిచాడు. అతడికంటేముందే, అక్కడ చేరిన తోటివాళ్లంతా అతడి చుట్టూ మూగారు. ఆశాపూరిత నేత్రాలతో అతడి కొత్త చొక్కావేపు చూస్తూ వుండిపోయారు. వాళ్లంతా ఆ కొత్త చొక్కాను గురించి మాట్లాడ్డం మొదలెడితే బేచర్‌కు అంతకుముందు తాను పంచిన బంతులు జ్ఞాపకం వచ్చాయి.

దారిలో అందరూ తన కొత్తచొక్కావేపే చూస్తూ వున్నారా? అనిపించింది బేచర్‌కు. తాను కూడా వాళ్ల చొక్కాల వేపు చూస్తున్నాడు. ఒకరిది చేనేతచొక్కా అయితే మరొకరిది పట్టుది. ఒకరిది ఖద్దరుచొక్కా అయితే మరొకడికి చొక్కానేలేదు. ఒకరిది విదేశీ టెర్లిన్‌ది. కొన్ని మామూలు చొక్కాలైతే కొన్ని రంగురంగులివి. ఇవాళ రోడ్డుపైన బేచర్‌కు మనుష్యులు కాకుండా చొక్కాలే వస్తూ పోతూ వున్నట్లనిపించింది.

* * *

త్రవ్వకం స్థలంవద్దకు వచ్చిన భిల్లుజాతి కూలీలంతా

బేచర్‌ను కొత్త చొక్కాలో చూసి మొదట చాలా సంతోషించారు. ఆనక నవ్వసాగారు.

''అబ్బ! పిల్లాడు పెళ్లికొడుకై కూలి చేయడానికివచ్చాడ్రా.''

కొంతమంది చొక్కాధర అడగసాగారు. చూస్తూ చూస్తూ వుండగానే ఎన్నోచేతుల మరకలు అతడి కొత్త చొక్కాకు అంటుకున్నాయి. బేచర్‌కు చాలా చెడ్డగాతోచింది. పనిజేయడానికి వచ్చిన భిల్లుజాతి ఆడపిల్లలు చప్పట్లుకొట్టి తనను దగ్గరికి పిలిస్తే, తాను భయపడి తిరస్కరించాడు.

త్రవ్వకం జరిగేచోట తమ పనుల్లో లీనమైవున్న చాలామంది కూలీలు బేచర్‌నుచూసి తమతమ పనులనే మర్చిపోయారు. వాళ్లందరి ఈర్ష్యాపూరితమైన, ప్రశ్నార్థకమైన, చురుకైన చూపుల్తో తన కొత్తచొక్కాకు చిల్లులు పడతాయేమోననిపించింది బేచర్‌కు.

అక్కడి భిల్లుజాతి కూలీలంతా మాసి చినిగి పోయిన బనియన్‌లు, చింకి పాతలైన చొక్కాలు తొడుక్కొని వున్నారు. వొళ్లు ముడతలు పడిపోయిన ముసలి వాళ్లు పాత అంగవస్త్రం ఒకటి మొలకు కట్టుకొనివున్నారు. కొంతమంది పోలీసులు తమ దుస్తుల్లో వున్నారు. బ్రాహ్మణ సూపర్‌వైజర్ ఒకాయన ఖాకీదుస్తులు వేసుకొని వున్నాడు. ఓ పెద్ద ప్రభుత్వాధికారి తెల్లటి సూటుతో ఖాకీటోపీ పెట్టుకొని వున్నాడు. ఇంకా ఎంతో మంది చేతులు చూస్తూ చూస్తూ వుండగానే బేచర్ కొత్త చొక్కాపట్టేలాగ్గా, కొన్ని గుండీలు ఊడిపోయాయి.

ఒక ముసలికూలివాడు తన పైపంచ తీసి పక్కనపెట్టి ఓ గిన్నెలో సున్నంకలిపి, బేచర్‌ను చొక్కా విప్పి రమ్మంటే, బేచర్ అదిరిపడ్డాడు.

అక్కణ్నుండి పరుగెత్తిన పరుగెత్తడం తన గుడిసె దగ్గరకు వచ్చి ఊపిరిపీల్చుకొన్నాడు. అతణ్ణిచూసిన తల్లిముఖం చిన్నపోయింది.

సాయంకాలం మంగాలూ అడిగితే, త్రవ్వకం జరిగేచోట తననెవరూ పనిలోకి పిలవలేదని చెప్పేశాడు.

మంగలూ ఆలోచన్లో పడిపోయాడు. మళ్లీ అడిగి బ్రతిమాలుకుందామని చీకటి పడగానే సూపర్‌వైజర్ ఇంటివేపువెళ్లాడు.

రాత్రికి పొద్దుపోయింతర్వాత మంగలూ గుడిసెకు వచ్చి చూస్తే ఉతికి ఆరవేసిన చొక్కా బయట తాడుపైన శిలవేసిన ఏసుక్రీస్తు బొమ్మలా కనపడింది. బేచర్ గుడిసె బయట దండెం వద్ద నేలమీద నిద్రపోతున్నాడు.

చొక్కా జేబులో ఒక మిణుగురు తళుకు తళుకు మంటుంది. మంగలూ చెయ్యివిసిరి దాన్ని విదిలించేశాడు.

బేచర్ నిద్రలో కలవరిస్తూ అట్టూ ఇటూ పొర్లుతున్నాడు

నిద్రపోతున్న బేచర్‌వేపు చూస్తూ వుండిపోయాడు తండ్రి మంగలూ. బేచర్ ఇంతకు ముందెన్నడూ చొక్కా తొడుక్కోని సంగతి అతడికి తెలుసు. కాని పనిచేయడానికి ఇష్టంకాకపోతే, తనను ఎవరూ పనిలోకి పిలవలేదని అబద్ధం చెప్పవలసిన అవసరమేముందీ ?

మంగలూ నక్షత్రాలు చెక్కిన ఆకాశపు చొక్కావేపు చూడలేదు, గుంపులు గుంపులుగావున్న మిణుగుర్ల మెరుపులవేపూ చూళ్లేదు. తలవొంచుకొని గుడిసెలోకి దూరాడు నిద్రపోవడానికి.

రాత్రి, నలువేపుల ప్రసరించిన రాత్రి, బేచర్ నిద్రమాదిరే నిశ్శబ్దంగావుంది. చొక్కా వొలిచిన మేకపిల్ల చర్మం మాదిరి తాడుమీద వేలాడుతోంది.

# 'గిరగిర'

'మోవి'

జరలో
  పారవిడి
ఒరచెడి
మరణం నవ్వింది.

భ్రాంతిలో
అశాంతిలో
కడలి కెరటాల్ని
వెనక్కు ముందుకు

తిప్పి విప్పి
జీవితం
ఉరక పరుగు నురుగు
కాదని
అడుగున అణిగిన
అగాధం లోతు
అవగతం కాలేదింకా
అయినా ఆగదీ పంకా
తిరుగును గిరగిర ...